కథ

# అనుభూతుల పండగ

వి. సుజాతరాయుడు

''పోస్ట్!''

శారద వెళ్లి పోస్ట్‌మాన్ అం చిన కవరు తీసుకుని ఫ్రం అడ్రస్ చూసింది.

'రాఘవ, హైదరాబాద్' అ వుంది.

ఆమె మనసు వికలం అయిపో ంది. కవర్ చించి అవతల పడేద్దామనుకుంది.



కానీ ఎందుకో మనసొప్పలేదు. అసలేం రాసాడో చదివి తర్వాత చింపి పడేయవచ్చు అనుకుంది.

లోపలికెళ్లి మంచంమీద వాలిపోయి కవరు చింపి లోపల్నుంచి గులాబీరంగు కాగితం బయటకు తీసింది.

కమ్మటి ఫ్రాగ్రెన్స్ ఆమె ముక్కుపుటాలకి సోకి తన్మయత్వానికి లోనయ్యేలా చేసింది. 'ఇలాంటి ట్రిక్స్ ప్లే చేసేకదా తనని లోబరుచుకుంది. మళ్లీ మొదలెట్టాడు' కసిగా అనుకుంది. అలా అనుకున్న మరుక్షణం మనసంతా ప్రశాంతత అలుముకున్నట్లు అన్పించింది.

కళ్ళు అక్షరాలని శ్రద్ధగా ఫాలో అయ్యాయి.

డియర్ శారూ,

ప్రేమించుకునేటప్పుడు 'ప్రేమ'కి మనిద్దరం రకరకాల నిర్వచనాలు చెప్పుకున్నాం. పెళ్లయ్యాక ప్రేమకి అసలైన అర్థం ఏమిటో తెలిసిందని చాలా సార్లు అనుకున్నాం. కానీ ప్రేమంటే ఏమిటో, ఇప్పుడు...ఇప్పుడు నాకు తెలిసింది. ప్రేమంటే ఒకరి గైర్హాజరులో మరొకరు పొందే ఆవేదన, హృదయంలో కలిగే శూన్య భావన. ఒకసారి నీతో అన్నాను గుర్తుందా? రక్త సంబంధం లేకపోయినా కేవలం పెళ్లి పేరుతో ఆడామగా ఒక ఒప్పందం కుదుర్చుకుని దానికి కాపురం అన్న పేరుపెట్టి జీవితాంతం వరకు కలిసి వుండడం చాలా విచిత్రమని... ట్రాష్ అని కొట్టి పారేసినా నాకు ఆ బంధంలోని విలువ ఇప్పుడు తెలుస్తోంది. ఆఫీసు నుండి ఇంటికి రాగానే ఆప్యాయంగా 'ఆలస్యమయిందేమని?' అడిగి, అలిగే నువ్వుండవు. కమ్మని కబుర్లు చెబుతూ వేడివేడిగా కంచంలో వడ్డించి ప్రేమగా తినిపించే అభిమానం కాగడా పెట్టి వెతికినా కన్పించదు. రాత్రయితే మంచంమీద నా పక్కన పడుకుని వెచ్చని అనుభూతులు కలిగిస్తూ లతలా నన్ను పూర్తిగా అల్లుకుపోయే స్పర్శ వుండదు. ప్చ్... రోజులు యాంత్రికంగా గడిచిపోతున్నాయి. నీ వియోగంలో ఎక్కువకాలం గడపలేను. ఇప్పటికే జీవచ్ఛవాన్నయ్యాను. నువ్వు కరుణించకపోతే శవాన్నవుతాను. నామీద ప్రేముంటే ఒక్కసారి నా దగ్గరికిరా. మనం అనుభూతుల పండగ జరుపుకుందాం. మన ఇన్నాళ్ళ కాపురాన్ని దృష్టిలో పెట్టుకునైనా నాకీ వరమియ్యి. ఈ జన్మకిది చాలు. పండగ తరువాత వుండడం, వెళ్లడం అనేది నీ ఇష్టం. ఒకవేళ నువ్వు వెళతానన్నా నేను నిన్ను అడ్డుకునే ప్రయత్నం చేయను. అన్నట్లు అనుభూతుల పండగ వచ్చే కార్తీక పౌర్ణమి రోజున నువ్వు నా కోసమొస్తావని కొండంత ఆశతో ఎదురు చూస్తూ

నీ కోసం పరితపించే రాఘవ

ఉత్తరం ఆసాంతం చదివాక ఆమెకి తెగ ఆశ్చర్యం కలిగింది.

'అనుభూతుల పండగేంటి?' అసలింతవరకూ వినలేదు. వెళ్లి క్యాలెండర్ తీసి చూసింది. ఆ రోజు అలాంటి పేరున్న పండుగేదీ లేదు.

మరెందుకలా రాసుంటాడు? కాసేపు ఆలోచించింది. ఆమెకేం తట్టలేదు.

శారద రాఘవ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ప్రేమించేటప్పుడు అహర్నిశలూ ఆమెనంటిపెట్టుకుని

తిరిగిన రాఘవ పెళ్ళయ్యాక పూర్తిగా ఆఫీసుకంకి తమై తనని నిర్లక్ష్యం చేశాడని ప్రతిరోజూ అతడితో గొడవ పడేది. పెళ్ళయ్యాక అనుకోకుండా ప్రమోషన్‌తో మంచి పొజిషన్‌లోకి రావడం వలన వర్క్ లోడ్ ఎక్కువైందని ఎంత నచ్చచెప్పినా ఆమెససేమిరా ఒప్పుకోలేదు. అతని అలక్ష్యాన్ని సహించలేకపోయింది. ఒకరోజు రాత్రి పదకొండు గంటలకి ఆఫీసు నుంచి వచ్చిన రాఘవతో తీవ్రంగా వాదనకు దిగి పెట్టె తీసుకుని పుట్టింటికి వచ్చేసింది. అతన్నుంచి కోర్టు ద్వారా విడిపోదామని నిశ్చయించుకుంది. తల్లి దండ్రులకి ఆ విషయం తెగేసి చెప్పేసింది. కూతరు మొండి మనస్తత్వం తెలిసిన వారవడంతో ఏమనలేక మిన్నకుండిపోయారు.

లాయర్‌ని కలసి వారం రోజుల క్రితం రాఘవకి విడాకుల నోటీస్ పంపింది. అంతలోనే ఈ ఉత్తరం.

ఆమెకి ఆ అనుభూతుల పండగేంటో తెలుసుకోవాలనిపించింది.

'ఒకవేళ తనని ట్రాప్ చేయడానికి ఏదైనా ప్లాన్ చేస్తున్నాడేమో? అలాంటిదేదైనా అయితే చెడామడా నాలుగు దులిపి వచ్చేస్తుంది. తనంటే ఏమిటో మరోసారి తెలియజేస్తుంది' అలా అనుకున్నాక ఆమె మనసు తేలికై నిద్రలోకి జారుకుంది.

పెట్టె తీసుకుని భర్త దగ్గరికి బయలుదేరింది. ఇన్నాళ్ళకైనా కూతురికి భర్త గుర్తొచ్చి వెళుతున్నందుకు ఆ దంపతులు మురిసిపోయారు.

కానీ 'నేను ఆయన దగ్గరకెళ్లి తాడోపేడో తేల్చుకుని రెండ్రోజుల్లో వచ్చేస్తాను' అనడంతో వాళ్ళు మ్రాన్పడిపోయారు.

★★★

ఇంటి ముందు ఆటో దిగి ఆశ్చర్యపోయింది.

వాకిలంతా చక్కగా కల్లాపి జల్లి రకరకాల ముగ్గులేసి వున్నాయి. గుమ్మానికి పచ్చ తోరణాలు వున్నాయి. లోపల నుంచి అగరుధూప సువాసనలు గాలిలో తేలి వస్తున్నాయి.

ఆటో ఆగిన చప్పుడు విని బయటకొచ్చిన రాఘవ పెట్టెతో నిల్చున్న శారదని చూసి ''రా.. శారదా'' అని ఆనందంగా ఆమె దగ్గరకెళ్లి సూట్‌కేస్ అందుకున్నాడు.

ఆమె కళ్ళెర్ర చేద్దామనుకుంది. ఎందుకో చేయలేకపోయింది. మౌనంగా అతడ్ని వెంబడించింది.

''అనుభూతుల పండగేంటో నీ ఊహకి అందలేదు కదూ? నేననుకున్నాను ఇవాళ ఒక్కరోజు నేను చేసేదానికి నువ్వడ్డు చెప్పకూడదు. నువ్వూ, నేను చిలకా గోరింకల్లా కలసి మెలసి వుందాం. నా ఒక్క కోరిక తీర్చు ప్లీజ్...'' అర్థించాడు.

శారద కాదనలేకపోయింది.

''నీకోసం బాత్రూమ్‌లో వేణ్ణీళ్ళు పెట్టాను. వెళ్లి తలంటుకుని బెడ్రూమ్‌లో వుంచిన కొత్త చీర కట్టుకో'' అన్నాడు.

> **పెట్టె తీసుకుని భర్త దగ్గరికి బయలుదేరింది. ఇన్నాళ్ళకైనా కూతురికి భర్త గుర్తొచ్చి వెళుతున్నందుకు ఆ దంపతులు మురిసిపోయారు. కానీ 'నేను ఆయన దగ్గరకెళ్లి తాడో పేడో తేల్చుకుని రెండ్రోజుల్లో వచ్చేస్తాను' అనడంతో వాళ్ళు మ్రాన్పడిపోయారు.**

అతను చెప్పినట్టే చేసింది.

క్షణంపాటు ఆమెవంక కన్నార్పకుండా చూసి పక్కనే వున్న పూల బుట్టలోంచి సన్నజాజుల మాల తీసిచ్చాడు.

ఆమె తలలో తురుముకుంది. సాక్షాత్తూ రతీదేవిలా వుంది. హోటల్ నుంచి తెప్పించి వుంచిన క్యారియర్ విప్పి పదార్థాలు డైనింగ్ టేబుల్‌పై సర్దాడు.

ఇద్దరూ కొసరి కొసరి వడ్డించుకుంటూ తిన్నారు.

కోపంగా ఆ ఇంట్లోకి అడుగుపెట్టిన ఆమెలో క్రమంగా కోపం స్థానే ఉత్సాహం చోటు చేసుకోసాగింది. అతని పనుల్లో భాగం పంచుకోసాగింది.

''అన్నట్లు మీరు అనుభూతుల పండగన్నారు కదా! అంటే ఏమిటి?'' చేతులతో చిలకలు చుట్టి రాఘవ నోటికందిస్తూ అడిగింది.

రాఘవ కొద్దిసేపు మౌనాన్ని ఆశ్రయించి తరువాత ''ఇవాళ మన పెళ్లిరోజు. పెళ్లయిన కొత్తలో ప్రతి ఇన్సిడెంట్ నా మది డైరీలో మధురానుభూతిగా ముద్రించుకుపోయింది. అందుకే మన పెళ్లిరోజుకి అనుభూతుల పండగని పేరు పెట్టాను. మరొక్కసారి ఆ అనుభూతుల్ని గుండెల్లో నింపుకోవాలనుకున్నాను. రేపు కోర్టులో మనిద్దరికి విడాకులు మంజూరు చేసాక నువ్వెవరో, నేనెవరో? అందుకే విడిపోయే ముందు ఒక్క మధురానుభూతిని హృదయపొరల్లో నిక్షిప్తం చేసుకుందామనుకున్నాను'' అతని గొంతు జీరబోయింది.

ఆమె కళ్లల్లో నీళ్ళు చిప్పిల్లాయి. మనసు ఆర్ద్రమయింది.

''నేను ఆఫీసుకి అంకితమై నీకు దూరమైన మాట వాస్తవమే. కానీ అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ నీపట్ల అవ్యాజమైన ప్రేమ వుంది. నీకు దూరమై నేనుండలేను. నువ్వంగీకరిస్తే నా పొరపాటుని సరిదిద్దుకుని నీతో సంపూర్ణమైన ఆనందం పొందుతాను. ఇహనుంచి ఉదయాలు మాత్రమే ఉద్యోగానికి. సాయంత్రాలు, రాత్రులు మనిద్దరివి, కేవలం మనిద్దరివి'' అన్నాడు.

ఆమె దుఃఖాన్ని దిగమింగుకోకలేపోయింది. నిజానికి ఆమె కూడా ఒంటరిగా ఉండలేకపోయింది.

అనుక్షణం అతనికి సంబంధించిన ఆలోచనలు కలవరపెట్టేవి. ఎన్నోసార్లు అతని దగ్గరకెళదామనుకుంది. అహంకారం అడుగు ముందుకు వేయనీయలేదు. ఇప్పటికే జీవితంలో కొంత కోల్పోయింది. మిగిలినది చేజార్చుకోలేదు. అతన్ని అల్లుకుపోయింది.

ఇహ ఈ బంధం జన్మలో విడదు. విడిపోవాలన్న ఆలోచనని శాశ్వతంగా దూరం చేసుకుంటూ అతడి గాఢ పరిష్వంగంలో కరిగిపోతోంది శారద.

★




